# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



ప్రజా ముచ్చట
తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు
99086 89674 లో
సంప్రదించగలరు



హైదరాబాద్ | శనివారం,ఏప్రిల్26,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1




## పహల్గామ్ దాడిని నిరసిస్తూ

# కొవ్వొత్తులతో ర్యాలీ

### కలిసికట్టుగా ఉగ్రవాదంపై పోరాడాలి

**- అభివృద్ధి పథంలో నడుస్తున్న దేశంపై దాడి చేశారని ఆగ్రహం...**

- పీవోకేను భారత్‌లో కలపాలి.. ఈ విషయంలో మోదీకి మద్దతు తెలుపుతున్నాం
- జమ్మూకశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో నిరసన
- తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజా వద్ద శాంతి ర్యాలీ
- పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్,ఏప్రిల్25,**
జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా హైదరాబాద్‌లో శాంతి ర్యాలీ జరిగింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు రాష్ట్ర మంత్రులతో పాటు మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ ర్యాలీలో పాల్గొని ఉగ్రవాద చర్యలను ఖండించారు. ఈ శాంతి ప్రదర్శన పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమై ట్యాంక్‌బండ్‌పై ఉన్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. పహల్గామ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో బాధితులకు సంఘీభావం తెలపాలని, ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో ఏఐసీసీ ముఖ్య నేతలు సమావేశమై చర్చించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, డివిజన్ కేంద్రాల్లో శాంతియుత నిరసనలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఇచ్చిన పిలుపులో భాగంగానే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ శాంతి ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.



## భారత్ కు అండగా

# నిలుస్తాం..

**అమెరికా డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసి గబ్బార్డ్**

- పహల్గామ్‌లో 26 మందిని లక్ష్యంగా చేసుకుని ఉగ్రదాడి
- భారత్‌కు అమెరికా డీఎన్ఐ తులసి గబ్బార్డ్ పూర్తి మద్దతు ప్రకటన
- దాడిని తీవ్రంగా ఖండించిన ప్రపంచ నేతలు, ఇస్లామిక్ దేశాలు

**ఏప్రిల్25,**
జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఘోర ఉగ్రదాడిపై అమెరికా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ, అమెరికా డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ (డీఎన్ఐ) తులసి గబ్బార్డ్ భారత ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు.

## హైదరాబాద్‌లో

# ముమ్మర తనిఖీలు

- పహల్గామ్ దాడి తర్వాత పాక్ పౌరుల వీసాలు రద్దు చేసిన భారత్
- హైదరాబాద్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టిన తెలంగాణ పోలీసులు
- పోలీసుల అదుపులో పాతబస్తీ యువతిని పెళ్లాడిన పాక్ జాతీయుడు మహమ్మద్ ఫయాజ్
- భార్యను కలిసేందుకు నేపాల్ మీదుగా నగరానికి వచ్చినట్లు గుర్తింపు
- విచారణ అనంతరం పాక్‌కు పంపిస్తామని పోలీసులు వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్25హ**





పహల్గామ్ ఉగ్రదాడి ఘటన అనంతరం పాకిస్తాన్ పౌరుల విషయంలో భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్న విషయం విదితమే. పాక్ పౌరుల వీసాలను రద్దు చేయడంతో పాటు, దేశం విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు తెలంగాణ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలో నిర్వహించిన సోదాల్లో పాకిస్థాన్‌కు చెందిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సొంతగడ్డపై సీఎస్కే కుదేల్...

- చెపాక్ స్టేడియంలో 5 వికెట్ల తేడాతో గెలుపొందిన హైదరాబాద్
- 155 పరుగుల లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో ఛేదించిన సన్ రైజర్స్
- లక్ష్య ఛేదనలో ఇషాన్ కిషన్ (44), కమిందు మెండిస్ (32) రాణింపు
- తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో 'విన్' రైజర్స్...



## అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి

# ప్రధాని మోదీ..

**ప్రధాని మోదీని ఆహ్వానించిన చంద్రబాబు**



- ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన
- ప్రధాని మోదీతో సమావేశం
- వివిధ అంశాలపై చర్చ

**న్యూఢిల్లీ,ఏప్రిల్25,**
ఉగ్రవాదంపై పోరాటంలో కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రభుత్వం అండగా నిలుస్తారని, ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పేలా కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా కట్టుబడి ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీతో అన్నారు. పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రదాడి తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని చెప్పారు. నేడు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈమేరకు తన సంఘీభావాన్ని తెలిపారు. ఉగ్రవాదులది పిరికిపంద చర్య అని, హింసను ఖండిస్తున్నామని ఈ సందర్భంగా అన్నారు. పహల్గామ్ బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు. భారతదేశ భద్రతను కాపాడే విషయంలో మోదీ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు.



- మంత్రుల ఫోన్లను స్వయంగా సీఎం ట్యాప్ చేయిస్తున్నారు
- కాంగ్రెస్, బీజేపీ కలిసి కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని విమర్శ
- రుణమాఫీ కాలేదని, నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్

## హామీల అమలులో ప్రభుత్వం

# విఫలమైంది

హైదరాబాద్,ఏప్రిల్25) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి తమ కేబినెట్‌లోని మంత్రుల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నారని అన్నారు. శుక్రవారం ఒక మీడియా సంస్థ ప్రతినిధితో మాట్లాడుతూ కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులంతా అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. సీఎం రేవంత్ రెడ్డికి తన పదవికి ఎక్కడ ముప్పు వాటిల్లుతుందోనన్న భయం పట్టుకుందని, అందుకే నిత్యం భయపడుతూ మంత్రుల ఫోన్లను ట్యాపింగ్ చేయిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, బీఆర్ఎస్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తుంటే, బీజేపీ నేతలు ఆయనకు మద్దతు పలుకుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆయన మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో ఏ ఒక్క గ్రామంలో కూడా వంద శాతం రుణమాఫీ జరగలేదని అన్నారు. రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తే తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మరోసారి సవాల్ విసిరారు. ఢిల్లీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునే హడావిడిలో ముఖ్యమంత్రి ఉంటే, మంత్రులు రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలా అని ఆలోచిస్తున్నారని విమర్శించారు. కొందరు పెద్దల ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ గాలి మాటలేనని, వీటిని నమ్మి ప్రజలు మోసపోయారని అన్నారు.

## సోనియా, రాహుల్ కు

# నోటీసుల జారీ వాయిదా...

**నోటీసులు ఇచ్చేందుకు కోర్టు నిరాకరణ..**

- లోపాలు సరిచేసి, మరిన్ని పత్రాలు ఇవ్వాలని ఈడీకి ఢిల్లీ కోర్టు ఆదేశం
- కేసు తదుపరి విచారణ మే 2కు వాయిదా



**న్యూఢిల్లీ,ఏప్రిల్25**
నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు తక్షణమే నోటీసులు జారీ చేయాలన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజ్ఞప్తికి ఢిల్లీ కోర్టులో తాత్కాలికంగా బ్రేక్ పడింది. సోనియా, రాహుల్ లకు నోటీసులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈడీ సమర్పించిన పత్రాల్లోని లోపాలను సరిదిద్దాలని, కేసుకు సంబంధించి మరింత నిర్ధారణతో కూడిన సరైన పత్రాలను అందించాలని న్యాయస్థానం దర్యాప్తు సంస్థను ఆదేశించింది."పూర్తిగా సంతృప్తి చెందే వరకు నేను అలాంటి ఉత్తర్వులు జారీ చేయలేను" అని న్యాయమూర్తి స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ దశలో విచారణను ఆలస్యం చేయవద్దని, నోటీసులు జారీ చేయాలని ఈడీ తరపు న్యాయవాది కోరినప్పటికీ, న్యాయస్థానం అందుకు అంగీకరించలేదు. ఈ మేరకు కేసు తదుపరి విచారణను మే 2వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది.నేషనల్ హెరాల్డ్ కేసులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏప్రిల్ 9వ తేదీన చార్జిషీట్ దాఖలు చేసిన విషయం విదితమే. సుమారు రూ. 5,000 కోట్ల మేర మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ ఈ చార్జిషీట్‌లో ఆరోపించింది

# పోషకాహార కిట్టుల పంపిణీ...



పెన్ పహాడ్/ ప్రజా ముచ్చట, ఏప్రిల్ 25:ప్రభుత్వం ఇస్తున్న పోషకాహార కిట్టులను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ స్రవంతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 22 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పోషకాహార కిట్టులను అందించి ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి బారిన పడిన బాధితులకు ప్రభుత్వం మెడిసిన్ తో కూడిన పోషకాహార కిట్టులను ఉచితంగా అందజేస్తుందని కావున వాటిని ఉపయోగించుకొని క్షయ నుంచి విముక్తులు కావాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు మందులను సక్రమంగా వాడినచో ఆరు నెలల్లోనే ఇట్టి వ్యాధికి ముగింపు పలుకొచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎల్.శశిరేఖ, ఎం పి హెచ్ ఈ ఓ భూతరాజు శ్రీనివాసులు, ఎం పి హెచ్ ఎస్ భూతరాజు సైదులు, ఫార్మసిస్ట్ అనిల్, ఎల్ టి లింగాల రాజు, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎం లు అదేవిధంగా హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్గా చిట్టి పోతుల రమేష్

హుజూర్ నగర్,ప్రజా ముచ్చట:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ 2025-26 శుక్రవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి.సాముల రామిరెడ్డి ప్యానల్ లో ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా పోటీ చేసిన జూనియర్ అడ్వకేట్ చిట్టి పోతుల రమేష్ 82 ఓట్లకు గాను 70 ఓట్లు సాధించి భారీ మెజార్టీతో గెలుపొందారు ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు,స్నేహితులు, పీర్ల కొట్టం యూత్ సభ్యులు అభినందనలు తెలిపారు.



# ఉద్యోగం మారుతున్నారా? ఈపీఎఫ్ఓ నుంచి మీకో గుడ్‌న్యూస్!

ఉద్యోగం మారినప్పుడు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాను ఒక సంస్థ నుంచి మరో సంస్థకు బదిలీ చేసుకోవడం ఇకపై మరింత సులభతరం కానుంది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూ, సరళీకరిస్తూ కీలక మార్పులు చేసింది. శుక్రవారం (ఏప్రిల్ 25, 2025) కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, కొన్ని సందర్భాలలో పీఎఫ్ బదిలీ క్లెయిమ్‌లకు యజమాని ఆమోదం అవసరం లేదు.ఇప్పటివరకు, పీఎఫ్ ఖాతా బదిలీ ప్రక్రియలో రెండు ఈపీఎఫ్ కార్యాలయాల పాత్ర ఉండేది. ఒకటి నిధులు బదిలీ అయ్యే సోర్స్ ఆఫీస్, రెండోది నిధులు జమ అయ్యే డెస్టినేషన్ ఆఫీస్. అయితే, ప్రక్రియను మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో, ఈపీఎఫ్ఓ మెరుగైన ఫారం 13 సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా డెస్టినేషన్ ఆఫీస్ వద్ద బదిలీ క్లెయిమ్‌ల ఆమోదం పొందాల్సిన అవసరాన్ని తొలగించారు.ఈ కొత్త విధానం ప్రకారం, ఇకపై బదిలీ క్లెయిమ్‌కు సోర్స్ ఆఫీస్ ఆమోదం లభించగానే, సభ్యుడి పాత పీఎఫ్ ఖాతాలోని మొత్తం నిల్వలు వెంటనే వారి డెస్టినేషన్ ఆఫీస్‌కు ఆటోమేటిక్‌గా బదిలీ అవుతాయి. ఇది ఈపీఎఫ్ఓ సభ్యుల జీవన సౌలభ్యాన్ని పెంచడంలో కీలక ముందడుగు అని మంత్రిత్వ శాఖ పేర్కొంది.అంతేకాకుండా, సభ్యుల ఖాతాల్లోకి నిధులు సత్వరమే జమ అయ్యేలా చూసేందుకు, సభ్యుల




ఐడీ, ఇతర అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా పెద్ద సంఖ్యలో యూఏఎన్‌లను ఒకేసారి జనరేట్ చేసే సదుపాయాన్ని కూడా ఈపీఎఫ్ఓ ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ను ఫీల్డ్ ఆఫీసులకు అందుబాటులోకి తెచ్చారు.దీనివల్ల ఈపీఎఫ్ఓ అప్లికేషన్‌లో ఆధార్ అవసరం లేకుండానే పాత బకాయిలను కూడా జమ చేయడానికి వీలవుతుంది. అయితే, పీఎఫ్ నిల్వల రక్షణకు, రిస్క్‌ను తగ్గించే చర్యగా, ఇలా జనరేట్ చేసిన యూఏఎన్‌లను ఆధార్‌తో అనుసంధానం చేసే వరకు హోల్డ్ లో ఉంచుతారు. ఆధార్ సీడింగ్ పూర్తయిన తర్వాతే అవి పూర్తిస్థాయిలో పనిచేస్తాయి.

# బాధను దిగమింగుకుని కోడలికి కొత్త జీవితాన్ని ఇచ్చిన మామ

కన్నకొడుకు అకాల మరణంతో శోకసంద్రంలో మునిగిన ఆ కుటుంబం, వితంతువుగా మారిన కోడలి భవిష్యత్తు గురించి ఆలోచించింది. సమాజం ఏమనుకుంటుందోనన్న సంకోచాలను పక్కనపెట్టి, ఆ కోడలికి స్వయంగా తండ్రి స్థానంలో నిలిచి, మరో వ్యక్తితో వివాహం జరిపించి కొత్త జీవితాన్ని అందించారు ఆ మామగారు. గుజరాత్‌లోని అంబాజీలో జరిగిన ఈ సంఘటన మానవత్వానికి, కుటుంబ విలువలకు అద్దం పడుతూ పలువురి ప్రశంసలు అందుకుంటోంది.వివరాల్లోకి వెళితే, అంబాజీకి చెందిన ప్రవీణ్ సింగ్ రాణా పెద్ద కుమారుడు సిద్ధరాజ్ సింగ్‌కు కృష్ణ అనే యువతితో వివాహమైంది. వారికి దీక్షిత అనే కుమార్తె ఉంది. అయితే, గత దీపావళి పండుగ సమయంలో సిద్ధరాజ్ సింగ్ ఆకస్మికంగా గుండెపోటుతో మరణించారు. ఊహించని ఈ పరిణామంతో కృష్ణ, చిన్నారి దీక్షితతో సహా రాణా కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. భర్త లేని జీవితం, తండ్రి లేని కుమార్తె భవిష్యత్తు ఎలా అనే ఆందోళనలో కృష్ణ మునిగిపోయింది.ఈ పరిస్థితుల్లో మామ ప్రవీణ్ సింగ్ రాణా ఒక సాహసోపేతమైన, ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నారు. కోడలిని తన కన్న కూతురిలా భావించి, ఆమెకు కొత్త జీవితాన్ని ఇవ్వాలని నిశ్చయించుకున్నారు. సమాజం ఏమనుకుంటుందోనని భయపడకుండా, తన దివంగత కుమారుడు సిద్ధరాజ్ సింగ్ ప్రాణ స్నేహితుడైన సంజయ్‌తో కృష్ణకు వివాహం జరిపించాలని నిర్ణయించారు. ఇరుపక్షాల అంగీకారంతో, ప్రవీణ్ సింగ్ దగ్గరుండి కృష్ణ, సంజయ్‌ల వివాహాన్ని




వైభవంగా జరిపించారు.కోడలితో పాటు మనవరాలు దీక్షిత కూడా కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న వేళ, వారిని అత్తారింటికి సాగనంపుతూ ప్రవీణ్ సింగ్ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారిని కదిలించింది. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలియడంతో నెటిజన్లు ప్రవీణ్ సింగ్, ఆయన కుటుంబంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇలాంటి ప్రేమ, ఆప్యాయతలే నేటి సమాజానికి ఆదర్శమని పలువురు వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా కృష్ణను వివాహం చేసుకున్న సంజయ్ మాట్లాడుతూ, "సిద్ధరాజ్ నా చిన్ననాటి స్నేహితుడు. కృష్ణ కూడా నాకు కొంతకాలంగా తెలుసు. ప్రవీణ్ సింగ్‌తో మాట్లాడాను. ఆయన మా పెళ్లికి అంగీకరించారు. కృష్ణను, దీక్షితను కంటికి రెప్పలా చూసుకుంటానని వారి కుటుంబానికి హామీ ఇస్తున్నాను" అని తెలిపారు. తనకు కొత్త జీవితాన్ని ప్రసాదించిన అత్తమామలకు కృష్ణ కన్నీటితో కృతజ్ఞతలు తెలియజేసింది.

# డీలిమిటేషన్ పోరు

జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)ను వ్యతిరేకిస్తూ వివిధ రాజకీయ పార్టీలతో జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఏర్పాటు మోడీ ప్రభుత్వ కుట్ర పూరిత చర్యకు తిరుగులేని హెచ్చరిక. జనాభా ప్రాతిపదికన 2026లో డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని కేంద్రం ఎప్పుడైతే వెల్లడించిందో ఆ క్షణం నుంచి రాజకీయంగా కలకలం లేచింది. నియంత్రణా చర్యలతో జనాభాను అదుపు చేసిన దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన మరింత ఎక్కువైంది. సరిగ్గా ఈ సమయంలోనే దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్లు తగ్గబోవంటూ హోం మంత్రి అమిత్‌షా వంటి వారి వివాదాస్పద వ్యాఖ్యలతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. కేంద్ర ఈ గందరగోళ అస్పష్ట వ్యవహారం నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె చీఫ్ స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాలతో పాటు డీలిమిటేషన్ వల్ల సీట్ల కోత కత్తి వేలాడుతున్న పంజాబ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయపార్టీలతో శనివారం చెన్నరులో నిర్వహించిన తొలి సమావేశం జయప్రదమైంది. కేరళ, పంజాబ్, తెలంగాణ సిఎంలతోపాటు కర్ణాటక డిప్యూటి సిఎం, బిఆర్ఎస్ సహా ఆరు రాష్ట్రాలకు చెందిన 14 పార్టీలు పాల్గొనడమే కాకుండా జెఎసిగా ఏర్పడటం భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించడం మంచి పరిణామం.డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం పారదర్శకతకు పాతరేసిందని అది చేస్తున్న విన్యాసాలే తెలుపుతాయి. దేశ వ్యాప్తంగా సీట్లుపెరగుతాయంటున్న మోడీ సర్కారు అందుకు ప్రాతిపదికేంటో ఇదమిత్థంగా పేర్కొనలేదు. రాష్ట్రాల్లో ఇప్పుడున్న సీట్ల నిష్పత్తితోనే పెరుగుతాయా లేదంటే జనాభా ప్రాతిపదికనా అనే విషయంలో మబ్బులో పెట్టి మాట్లాడుతోంది. ఒక వేళ జనాభానే కొలబద్ద అయితే జాతి హితం కోసం జనాభాను నియంత్రించిన రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయి. పార్లమెంట్‌లో వాటి ప్రాతినిధ్యం కుదించుకుపోతుంది. ఈ చర్య అన్యాయంగా ఆయా రాష్ట్రాలను శిక్షించడమే అవుతుంది. పర్యవసానంగా కేంద్రం నుంచి నిధులు తగ్గుతాయి. సంప్రదాయం, గుర్తింపు, అభివృద్ధి, రాజకీయశక్తి క్షీణిస్తుంది. రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయి. సామాజిక న్యాయం, మహిళా సాధికారత దెబ్బతింటుంది. 1971 తర్వాత దక్షిణాది సహా మరికొన్ని రాష్ట్రాలు జనాభాను నియంత్రించాయి. ఎమర్జెన్సీ సమయం 1976లో, వాజ్‌పేయి హయాం 2001లో చేసిన రాజ్యాంగ సవరణలు సీట్ల సంఖ్యను ఫ్రీజ్ చేశాయి. ఇప్పుడు జనాభా ప్రాతిపదిన డీలిమిటేషన్ అంటే జనాభా నియంత్రణ లక్ష్యాలను చేరుకోని ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సీట్లు



పెరుగుతాయి. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ నిజానికి 2021కే పూర్తి అయి ఉండాలి. కాని ఆ లెక్కలు వెల్లడించే కఠోర వాస్తవాలను స్వీకరించే దమ్ము లేని బిజెపి ఏకంగా జనగణననే నిరవధికంగా వాయిదా వేస్తోంది. మరోపక్క డీలిమిటేషన్ వివాదాన్ని ముందుకు తెచ్చి 'జనాభా ప్రాతిపదిక' అంటోంది. ఇది ఆ పార్టీ నయవంచనను వెల్లడిస్తోంది. ఉత్తరాదిలో బిజెపి ప్రభావం ఎక్కువ. ఉత్తరాదిలో, బిజెపి పాలిత రాష్ట్రాల్లో సీట్లు పెంచుకొని రాజకీయంగా లబ్ధి పొందే కుట్రకు బిజెపి తెరతీసిందని అనుమానం వస్తుంది. ఈ తరుణంలో మరో పాతికేళ్లపాటు డీలిమిటేషన్ వద్దన్న విపక్ష పార్టీల జెఎసి డిమాండ్ న్యాయసమ్మతమైంది.డిఎంకె నిర్వహించిన సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ హాజరుకాగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవ్వరూ వెళ్లలేదు. అధికార కూటమి పార్టీలు డీలిమిటేషన్ పర్యవసానాలపై నోరు మెదపకపోవడం రాష్ట్రానికి హానికరం. టిడిపి, జనసేన పార్టీలు బిజెపి కుట్రలో భాగస్వాములైతే రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం చేసినవారవుతారని గ్రహించాలి. వైసిపి స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి వెళ్లకుండా ప్రధానికి లేఖ రాసింది. దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గకూడదంటూనే మోడీ నేతృత్వం పట్ల తన విధేయతను జగన్ చాటుకోవడం ఆ పార్టీ అవకాశవాద వైఖరికి నిదర్శనం. ఇక తెలుగు ప్రజల కోసమే పుట్టానని చెప్పే టిడిపి మౌనం వహించడం తెలుగు ప్రజలను వంచించడమే. ఇప్పుడైనా మౌనం వీడి అసంబద్ధ, అన్యాయమైన డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా టిడిపి, జనసేన తమ వైఖరిని ప్రకటించాలి. రాష్ట్ర ప్రజలకు జవాబు చెప్పవలసిన బాధ్యత నుంచి ఈ పార్టీలు తప్పించుకోలేవు.

# సుంకాల యుద్ధం -బలహీన పడుతున్న అమెరికా ఆధిపత్యం

ప్రపంచం మీద పెత్తనం చెలాయిస్తున్న శక్తులు తమ ప్రచార దిశను మార్చుకున్నట్టుంది. నిన్నటిదాకా అంతర్జాతీయ వాణిజ్యం మీద ఏ దేశమూ ఎటువంటి ఆంక్షలూ విధించకూడదని, ఆంక్షలు లేని వాణిజ్యం భాగస్వాము లందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు తమ తమ దేశాల ప్రయోజనాలను రక్షించుకోవడమే ప్రధానంగా మారినట్టు కనిపిస్తోంది. దానితోబాటు పాత కాలపు వలసాధిపత్య భావాలను కూడా మళ్ళీ ప్రకటిస్తున్నారు. ఈ ప్రపంచాన్ని శాసించే హక్కు తమకే ఉందన్నట్టు ప్రవర్తిస్తున్నారు. అమెరికా వివిధ దేశాలతో జరిపే వాణిజ్యంలో ఆ దేశాల నుండి దిగుమతి చేసుకునే సరుకులే ఎక్కువ. అమెరికా నుండి ఆ దేశాలకు జరిగే ఎగుమతులు తక్కువ. ఇప్పుడు ట్రంప్ అటువంటి దేశాల నుండి వచ్చే దిగుమతులపై అధిక సుంకాలను విధిస్తున్నాడు. ఈ చర్యల్లో ఆర్థిక హేతుబద్ధత కన్నా ప్రజలను ఆకట్టుకోవడమే ప్రధానంగా కనిపిస్తోంది. గతంలో అమెరికా చాలా ఉదారంగా ఇతర దేశాల ఎడల వ్యవహరించినట్టు, దానివలన ఆ దేశాలన్నీ ప్రయోజనాలు పొందినట్టు, ఇప్పుడు అమెరికా తన స్వంత దేశపు పరిశ్రమల రక్షణకు, తన స్వంత కార్మికుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడానికి సుంకాల పెంపు తప్పదన్నట్టు ఈ నాటకం నడుస్తోంది.పెట్టుబడి ఎప్పుడూ రంగులు మారుస్తూనే వుంటుంది. నయా ఉదారవాద శకం ప్రపంచం మీద తన విధానాలను రుద్దడానికి ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ వంటి సంస్థలను సాధనాలుగా వాడుకోవడంతో ఆవిష్కరించబడింది. ప్రపంచంలో ఎక్కడెక్కడ చౌకగా కార్మికుల శ్రమను కొల్లగొట్టవచ్చో, అక్కడికల్లా ప్రపంచ పెట్టుబడి తరలిపోయింది. ఎక్కడ సహజ వనరులు చౌకగా దొరుకుతాయో అక్కడ వాటిని చేజిక్కించుకుంది. ఒకదాని వెంట మరొకటిగా దేశాలు ఈ నయా ఉదారవాద పెత్తనానికి లొంగిపోయాయి. పోటీ ప్రపంచం అనే పేరుతో తమ తమ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద తమకున్న నియంత్రణను విడిచిపెట్టి, తమ పాలనా విధానాలను తామే రూపొందించుకునే హక్కును సైతం గాలికొదిలేశాయి. దిగుమతుల మీద ఆంక్షలు ఎప్పుడైతే సడలించడం జరిగిందో అప్పుడు ఆ యా దేశాల్లోకి పెద్దపెట్టున సరుకులు వచ్చిపడడం మొదలైంది. దాని వలన దేశీయ పరిశ్రమలు దెబ్బ తిన్నాయి. ఈ విధానాలకు లోబడి వ్యవహరించడానికి నిరాకరించిన చైనా వ్యూహాత్మకంగా తన స్వంత శక్తి సామర్థ్యాలను పెంచుకోవడం మీద కేంద్రీకరించింది. ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడగల సామర్థ్యాన్ని పెంచుకుంది.చాలామంది ఆర్థిక వ్యాఖ్యాతలు చైనా బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందన్న వాస్తవాన్ని గుర్తిస్తున్నారు కాని అలా ఎదగడానికి కారణం చైనా నయా ఉదారవాద విధానాల చట్రంలో ఇమిడేందుకు తిరస్కరించి తన స్వంత విధానాలను అమలు చేయడమేనన్న వాస్తవాన్ని మాత్రం గుర్తించరు. ప్రస్తుతం జి-7 దేశాలు నమోదు చేస్తున్న ఆర్థిక వృద్ధిరేటు కన్నా ఎక్కువ వృద్ధిరేటుతో ఉన్న దేశాలు బ్రిక్స్ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. అమెరికా అగ్ర స్థానం క్రమంగా చేజారుతోంది. అందుకే దిక్కు తోచని స్థితిలో పడి గతంలో తాను ప్రవేశపెట్టిన స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలను ఇప్పుడు తానే ఉల్లంఘిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడి ప్రయోజనాల గురించి మాట్లాడుతూ వచ్చిన అమెరికా ఇప్పుడు 'జాతీయ ప్రయోజనాల' గురించి మాట్లాడుతోంది. ఎంత గొప్పగా జాతీయ ప్రయోజనాల గురించి మాట్లాడినా, అదనంగా విధించిన సుంకాల వలన అమెరికాకు దిగుమతి అయ్యే సరుకుల ధరలు పెరుగుతాయి. దానివలన అమెరికన్ పౌరులు ఎక్కువ సొమ్ము వెచ్చించాల్సి వస్తుంది. ఇంకో పక్క ఈ కొత్త సుంకాలపై అంతర్జాతీయ పెట్టుబడి ఏ విధంగా ప్రతిస్పందిస్తుందో, ఆ యా దేశాలు అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను ఏ విధంగా మార్చుకుంటారో చూడాలి. దీని పర్యవసానాలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఏ విధంగా స్వీకరిస్తుందో అదీ చూడాలి. వాణిజ్య సంబంధాలలో పెరుగుతున్న అనిశ్చిత పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఉత్పత్తి, సరఫరా చెయిన్లను ఏ విధంగా దెబ్బ తీస్తాయో అది కూడా పరిశీలించాలి. ప్రస్తుతం అమెరికా, భారత్‌ల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు రానున్న కాలంలో ఇరు దేశాల వాణిజ్య సంబంధాలపై ఏ విధమైన ప్రభావాన్ని చూపుతాయో చూడాలి.ప్రతీకార సుంకాలుభారతదేశానికి, అమెరికాకు నడుమ 125 బిలియన్ల డాలర్ల (12,500 కోట్ల డాలర్లు లేదా రూ.10, 79,500 కోట్లు) వాణిజ్యం సాగుతోంది. అమెరికాకు భారతదేశం ఎగుమతి చేసే సరుకులపై విధించే సగటు సుంకం ఇప్పుడు 2.8 శాతం ఉంది. అదే అమెరికా భారతదేశానికి ఎగుమతి చేసే సరుకుల మీద సగటు సుంకం 7.7 శాతం ఉంది. ఇప్పుడు అమెరికా కూడా భారతదేశం నుండి ఎగుమతి అయ్యే సరుకుల మీద 7.7 శాతానికి సుంకాన్ని పెంచనుంది. దీని వలన వివిధ రంగాలలో వివిధ రకాలుగా ప్రభావం పడుతుంది. ట్రంప్ కోరుతున్నట్టు అమెరికా నుండి మనకు దిగుమతి చేసుకునే సరుకులపై మనం సుంకాన్ని గనుక తగ్గిస్తే అప్పుడు అక్కడి నుండి ఎక్కువగా దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులు భారతీయ మార్కెట్ లో చౌకగా లభిస్తాయి. మన స్వదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు రేట్లు ఇంకా తగ్గిపోతాయి. అదే మనదేశం నుండి ఎగుమతి అయే సరుకులపై అమెరికా ఎక్కువ సుంకాన్ని విధిస్తే ఇక్కడి నుండి మనం పంపే ఆటో విడి భాగాలు, మాంసం తదితర ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు, వజ్రాలు, బంగారు ఆభరణాలు, రసాయనాలు, ఔషధాలు వంటివి మరింత ఖరీదౌతాయి. అప్పుడు వాటికి అమెరికాలో డిమాండ్ తగ్గుతుంది. ఒక తాజా అధ్యయనం ప్రకారం మన దేశం నుండి ఎగుమతి చేసే ప్రాసెస్డ్ ఫుడ్ మీద సుంకం 32.37 శాతం పెరుగుతుంది. అదే విధంగా ఆటో విడి భాగాల మీద 23.10 శాతం, వజ్రాలు, ఆభరణాల మీద 13.32 శాతం, రసాయనాలు, ఔషధాల మీద 8.63 శాతం పెరుగుతుంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల మీద, లెదర్, పేపర్, గ్లాస్, ప్లాస్టిక్ వస్తువుల మీద, జౌళి, దుస్తుల మీద, యంత్రాల మీద, కంప్యూటర్ తయారీలో ఉపయోగించే ఖనిజాల మీద, వివిధ రకాల లోహాల మీద సుంకాలు పెరుగుతాయి.సుంకాలు పెరిగితే మనం ఎగుమతి చేసే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా మన ఎగుమతులు తగ్గవచ్చు. మరోపక్క అమెరికా తాను భారతదేశానికి ఎగుమతి చేసే వ్యవసాయోత్పత్తుల మీద విధిస్తున్న సుంకాన్ని తగ్గించాలని పట్టుబడుతోంది.